క్లుప్తంగా

పెరవలిలో కుష్ఠు సర్వే



పెరవలి(వేమూరు): మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుష్ఠు వ్యాధిపై సర్వే చేసినట్లు వైద్యాధికారి వెంకట సురేష్ గురువారం తెలిపారు. పెరవలి గ్రామంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కుష్ఠు వ్యాధిపై సర్వే చేశారని చెప్పారు. మండలంలో కుష్ఠు అనుమానితులు 141 మందిని గుర్తించడం జరిగిందన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాధికారత సాధించాలి



చెరుకుపల్లి: రైతులు జీపీసీ పొలంబడిలో చేరి నాణ్యమైన అధిక దిగుబడులు, లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి ఎ.మహేష్ బాబు అన్నారు. కావూరు గ్రామంలో ఐఎన్‌డీ–జీపీపీ పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీ ఐఎన్‌డీ–జీపీపీ పొలంబడి కార్యక్రమానికి కావూరు గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. మినుము వేసిన 30మంది రైతులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు విత్తన శుద్ధి, విత్తన మొలక శాతం పరీక్ష వంటి ప్రయోగాలు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, వీఏఏలు, ఏఈఓలు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో రసాయన శాస్త్రంపై పట్టు సాధించాలి



రేపల్లె రూరల్: ఏకాగ్రత, పట్టుదలతో రసాయన శాస్త్రం అభ్యసిస్తే సులువైనది మరొకటి ఉండదని రసాయ వాస్త విశ్లేషకులు, ప్రొఫెసర్ శింగంశెట్టి ముత్తారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు భూసార రసాయన పరీక్షలు అంశంపై నిర్వహించిన సదుస్సులో ఆయన మాట్లాడారు. పంటల సాగుకు భూసార పరీక్షలు తప్పనిసరన్నారు. అలాగే భూమిలో ఎలాంటి మూలకాలు లభ్యమవుతాయో.. తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పీహెచ్ విశ్లేషణ, పోషకాల, లోహాల, నీటి శుద్ధి విశ్లేషణలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలను ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ టీసీ రవిచంద్ర కుమార్, రసాయన శాస్త్ర అధ్యాపకురాలు అనూష, అధ్యాపకులు కోటేశ్వరరావు, వీవీ రవీంద్ర పాల్గొన్నారు.

ఆలపాటి గెలుపునకు కృషి

వేమూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు. మండల కేంద్రంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం విజ్ఞాన మందిరం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌లో నామినేషన్ వేయడం జరుగుతుందన్నారు.

బాలకోటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.69,883



రేపల్లె రూరల్: మండలంలోని అవరపల్లి గ్రామంలో వేంచేసియున్న బాలకోటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ కమిటీ పర్యవేక్షణాధికారి దివి వెంకట అప్పలాచార్యులు పర్యవేక్షణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి స్వామివారి హుండీ లెక్కించగా రూ.69,883ల ఆదాయం సమకూరిందన్నారు. గతేడాది కంటే రూ.34,241 ఆదాయం అధికంగా పెరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 26న ఆలయంలో స్వామివారికి భక్తులు కొట్టే కొబ్బరి చిప్పలను పోగు చేసుకునే హక్కుకు వేలంపాట నిర్వహించగా రూ.39వేలు ఆదాయం సమకూరిందన్నారు. గత ఏడాదితో పోల్చితే రూ.11వేలు ఆదాయం పెరిగిందని తెలిపారు. వేలంపాట దక్కించుకున్న వారు 26వ తేదీ ఒక్కరోజు మాత్రమే కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం కాకూడదు అశ్లీలం

- సూర్యలంక తీరంలో అశ్లీల కార్యకలాపాలు
- మద్యం మత్తులో సోయ లేని యువత
- కొరవడి పోలీసుల పర్యవేక్షణ



తీరంలో యువతీయువకుల విహారం

బాపట్ల: ఆహ్లాదానికి మారుపేరు సూర్యలంక సముద్ర తీరం. రాష్ట్రంలోనే సహజసిద్ధమైన తీర ప్రాంతంగా గుర్తింపు పొందింది. పోలీసుల పర్యవేక్షణ లోపం కారణంగా అశ్లీలానికి కేరాఫ్‌గా మారింది. సహజంగా వేసవి సెలవుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి పర్యాటకులు సేద తీరేందుకు సూర్యలంక తీరానికి అధిక సంఖ్యలో వస్తుంటారు. ముఖ్యంగా ఆది, శని వారాల్లో కనీసం 3,500 నుంచి 5 వేల మంది పర్యాటకులు తీరానికి చేరుకొని సముద్ర స్నానాలాచరిస్తుంటారు. ఎంతో పవిత్రమైన పుణ్య స్థలంగా భావించే సూర్యలంకలో పర్యాటకులతో పాటు, సమీప ప్రాంతాల్లోని ప్రజలు తీరానికి చేరుకొని ''గంగమ్మ'' పసుపు, కుంకుమలతో కూడిన ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

అశ్లీలం కేరాఫ్ సూర్యలంక..

నాడు ఆహ్లాదానికి...సహజ సిద్ధమైన సౌందర్యాలకు చిరునామాగా ఉండే సూర్యలంక తీరం అశ్లీలానికి కేరాఫ్‌గా మారింది. పోలీసుల అలసత్వాన్ని ఆసరాగా తీసుకున్న యువకులు యథేచ్ఛగా యువతలను తీసుకొని నేరుగా సూర్యలంక తీరానికి చేరుకొని... తీరంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఓ వైపు గంగమ్మను ఆరాధ్య దైవంగా పూజించే మహిళలు పుణ్యస్నానాలు ఆచరిస్తుంటే....అదే సమయంలో తీరంలో యువతి, యువకులు అశ్లీల నృత్యాలకు పాల్పడటం మహిళల మనోభావాలు దెబ్బతిస్తున్నాయి.

కొరవడిన పోలీసుల నిఘా..

తీరంలో ఎలాంటి అంసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, మద్యం విక్రయాలు జరగకుండా చూసుకోవాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని పర్యాటకులు పెదవి విరుస్తున్నారు. అలాగే తీరం ఒడ్డున మద్యం యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. దీంతో యువకులు తీరానికి చేరుకొని మద్యం సేవించి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. రెండేళ్లుగా పరిశీలిస్తే చదువుకునే యువకులే మద్యం తాగి ఇక్కడ 15 మందికి పైగా మృత్యువాతపడ్డారు. వాచ్‌టవర్‌ను నిర్మించిన పోలీసులు వాటిపై సిబ్బందిని ఉంచడం మరిచారు. ఇప్పటికైనా పోలీస్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి తీరంలో జరుగుతున్న అంసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయకపోతే ముున్ముందు తీరానికి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ఆర్డీవో నేలపు రామలక్ష్మి



వైద్యులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు సూచనలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

రేపల్లె రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీవో నేలపు రామలక్ష్మి హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలపై స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, డివిజన్ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల వైద్యులతో రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి స్కానింగ్ సెంటరుకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరన్నారు. ఆర్ఎంపీ వైద్యుడు సూచించిన వారికి స్కానింగ్‌లు చేయరాదన్నారు. ప్రతి స్కానింగ్ సెంటరులో రికార్డులను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. స్కానింగ్ సెంటరుకు వచ్చిన గర్భిణుల వివరాలు, రిఫర్ చేసిన వైద్యశాల, వైద్యశాల వైద్యుడి వివరాలు తప్పనిసరిగా రికార్డులలో పొందుపరచాలన్నారు. రికార్డు నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. పీహెచ్‌సీలలో హైరిస్క్ ఉన్న కేసులను 108 సహాయంతో సమీపంలోని సీహెచ్‌సీలకు, జీజీహెచ్‌లకు పంపించాలన్నారు. ప్రతి ప్రభుత్వ జూనియర్, డిగ్రి కళాశాలలో లింగ నిర్ధారణ పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ఎస్టీ కాలనీలలో బాల్య వివాహాల నిరోధానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తూ చదువు ప్రాముఖ్యతను వివరించాలన్నారు. తరచుగా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను నిర్వహించాలని ఆదేశించారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో డీఎస్పీ ఆవుల సాంబశివరావు, వైద్యులు భూషణరావు, వసంతం వీరరాఘవయ్య, సుధాకర్, శ్వేత, కృష్ణ, చైతన్య, రమేష్, జాన్‌ప్రసాద్, షేక్ షాహీన్, సభ్యులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష



ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న ఎంపీడీవో నాగలక్ష్మి

నిజాంపట్నం: గ్రామాల అభివృద్ధిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల పాత్ర కీలకమని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించి, ఆమె మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించడంతో పాటు కావాల్సిన పనులపై నివేదికలు తయారు చేయాలన్నారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



పాతనందాయపాలెం సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. గురువారం యాజలి, పాతనందాయపాలెం గ్రామ సచివాలయాలను ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు సమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయాలకు వచ్చినప్పుడు వారితో గౌరవంగా మాట్లాడాలన్నారు. సిబ్బంది అందరూ నిర్దేశిత సమయానికి సచివాలయానికి రావాలని చెప్పారు. గ్రామంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సచివాలయం సిబ్బంది ఉన్నారు.

జీవన విధానంలో మార్పుతోనే సమాజంలో గౌరవం

సంచార జాతుల అవగాహన సదస్సులో కేసీ బసవయ్య



మాట్లాడుతున్న కేసీ బసవయ్య

తెనాలి: మనిషిని మనిషిగా గౌరవం పొందాలంటే మన జీవన విధానంలో మార్పు రావాలని పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కేసీ బసవయ్య అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్సీ) ఆధ్వర్యంలో గురువారం తెనాలి పట్టణ పరిధిలోని కఠెవరం కాల్వకట్టపై గల ఎస్టీ కాలనీలో సంచార జాతుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ, కష్టాలపై ఏర్పాటైన అవగాహన సదస్సుకు డీబీఆర్‌సీ కో–ఆపరేటివ్ సొసైటీ సూపర్‌వైజర్ బందెల రమేష్ అధ్యక్షత వహించారు. బసవయ్య మాట్లాడుతూ చెత్తను సేకరించటమే ఉపాధిగా జీవిస్తున్న కుటుంబాల్లో మార్పు రావాలంటే, వారంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుభాని మాట్లాడుతూ ఈ–శ్రమ కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ తీసుకునే వారు మినహా మిగిలిన ప్రతిఒక్కరూ కార్డులు పొందాలని, భవన నిర్మాణం కార్మికులు ఐదు సంవత్సరాలకు రూ.110 చెల్లించి కార్డు తీసుకోవాలని సలహానిచ్చారు. పనిచేస్తున్న క్రమంలో ఏదైనా ఇబ్బందులు జరిగితే ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం చేస్తుందని ఈ రెండు కార్డులను ప్రతి ఒక్కరు తీసుకొని ఉపయోగ పెట్టుకోవాలని కోరారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ప్రముఖ న్యాయవాదులు గుమ్మడి రవిరాజ్, సీహెచ్ రాజారావు, సాంబశివరావు, మహిళా పోలీస్ దేవి, సంస్థ ఏరియా కో–ఆర్డినేటర్ రాజశేఖర్, సంచార విముక్తి జాతులు, వేస్ట్ పిక్కర్స్, ఎయిర్ పిక్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిల సకాలంలో చెల్లించి సహకరించండి

తెనాలి: పట్టణంలోని నంబరు 22 ది తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ బకాయిదారులు సకాలంలో బకాయిలు చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని బ్యాంక్ ఛైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు కోరారు. బ్యాంకు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత మూడు నెలల కాలంలో బ్యాంకు డిపాజిట్లు రూ.1.50 కోట్లకుపైగా పెరిగాయని, ఎన్‌పీఏ బకాయిలు కోటి రూపాయలకు పైగా వసూలు చేశామని తెలిపారు. ఏడాది కాలపరిమితి గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 9 శాతం వడ్డీని ఇస్తున్నామని తెలిపారు. కేవలం 79 పైసల వడ్డీకే బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.5,300 ఇస్తున్నామని చెప్పారు.

రహదారి ప్రమాదాలు నివారించాలి

రేపల్లె రూరల్: వాహనాలు నడిపే సమయంలో చోదకులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని మోటర్ వెహికల్ ఇనిస్పెక్టర్ ప్రసన్నకుమారి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రయాణాలు చేసే సమయంలో హెల్మెట్ వినియోగం తప్పనిసరన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. అతివేగం అనర్థదాయకమన్నారు. మైనరు బాలురు వాహనాలు నడపరాదని సూచించారు. సీఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ



బాపట్ల: యాచకులను దుప్పట్లు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.హరి పేర్కొన్నారు. పట్టణంలోని పలు దేవాలయాల వద్ద యాచకులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆహార పదార్థాలను అందించారు. యాచకుల పట్ల దయతో ప్రజలు ఉండాలని కె.హరి సూచించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు గండూరి వీరబ్రహ్మం, సెక్రటరీ కృష్ణారావు, ట్రెజరర్ బి.వెంకటేశ్వర్లు, కోటి సుబ్బారావు, కె.కాళిదాసు, శ్రీనివాసు, ఎం.ఎల్.వి ప్రసాద్ పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన యువకుడు

చెరుకుపల్లి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం రాజవోలు గ్రామానికి చెందిన ముచ్చు నాగార్జునరెడ్డి అనే యువకుడు చెరుకుపల్లి నుంచి రాజవోలు వెళుతుండగా నగరం అడ్డరోడ్డు సమీపంలో బైకు అదుపుతప్పి పడిపోయాడు. దీంతో యువకుడికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు యువకుడిని దగ్గరలోని ప్రవేటు వైద్యశాలకు తరలించారు.

బాకీ అడిగితే దాడి చేశాడు

తెనాలిరూరల్: బాకీ విషయమై యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలి చినరావూరు గేటు వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన షేక్ సాధిక్ బావ ఇదే ప్రాంతానికి చెందిన షేక్ రెహమాన్ తల్లికి కొంత నగదు అప్పుగా ఇచ్చాడు. బాకీ విషయమై సాధిక్, రెహమాన్ ఘర్షణ పడగా రెహమాన్ సాధిక్‌పై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఇసుక రీచ్‌ల అనుమతులు



ఇసుక రీచ్ వద్ద గుంత తవ్వించిన అధికారులు

కొల్లిపర: కూటమి ప్రభుత్వం ఇటీవలన మూడు ప్రవేటు కంపెనీలకు మండలంలోని కృష్ణా నదిలో మున్నంగి, బొమ్మువానిపాలెం 14,15 గల ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చింది. ఈక్రమంలో గురువారం వారికి ఇచ్చిన అనుమతులు గడువు ముగిసి పోవడంతో తహసీల్దారు జి.సిద్ధార్థ, ఎస్ఐ పి.కోటేశ్వరరావు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆయా ఇసుక రీచ్‌ల వద్ద ఎటువంటి వాహనాలు రాకపోకలు లేకుండా మిషన్ ద్వారా గుంటలు తీయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు ఇచ్చిన గడువు నేటితో పూర్తి కావటంతో ఎవరూ అక్రమంగా ఇసుక తవ్వకాలు జరగకుండా ఉండాలని ఉద్దేశంతో నిన్నటి వరకు డంపింగ్ చేసిన సంఘటనా స్థలంలో యంత్రాలు ద్వారా గుంతలు తీయించారు. ఈ గుంతలు ఎవరైనా పూడ్చి ఇసుక తరలించటం వంటి సంఘటలకు పాల్పడితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు.

నిఘా నీడలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి



అధికారులతో మాట్లాడుతున్న ఈఆర్వో రామలక్ష్మి

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు కృషి చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో నేపు రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై గురువారం పోలీసు, ఎన్నికల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రేపల్లె సబ్ డివిజన్‌లో పట్టభద్రులు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో రేపల్లె నియోజకవర్గంలో 13, వేమూరు నియోజకవర్గంలో 10 పోలింగ్ కేంద్రాలున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల రోజున 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అధికారులు బూత్‌ల పరిధిలో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా పర్యవేక్షించాలన్నారు. నిర్ణీత ఎన్నికల తేదీ 48 గంటల ముందు అభ్యర్థులు ప్రచారాలు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుడులు, చర్చిలు, మసీదులు, వైద్యశాలల సమీపంలో ప్రచారాలు నిర్వహించరాదని, ఆయా ప్రదేశాలలో ప్రచారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక రుగ్మతలు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల: వైదిక ధార్మిక పరిష్కారాల ద్వారా అనేక రకాలైన శారీరిక మానసిక రుగ్మతలను రూపుమాపవచ్చని అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ పేర్కొన్నారు. బాపట్ల చీలు రోడ్డులోని పాండురంగ స్వామి దేవస్థానం ప్రాంగణంలో 14 రోజులుగా జరుగుతున్న వైదిక ధార్మిక పరిష్కారాల శిబిరం గురువారంతో ముగిసింది. విఠలేశ్వర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సరైన మార్గంలో ముందుకు వెళ్లడానికి సరిన మార్గ నిర్దేశం చేసే గురువు అవసరం తప్పకుండా ఉందన్నారు. గురువుల ద్వారా సమాజం ఎల్లప్పుడూ ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు చెన్నకేశవ శాస్త్రి మాట్లాడుతూ విశాల విశ్వాన్ని, జంతుజాలాన్ని సృష్టించిన భగవంతుని నిష్ఠగా ఆరాధించడం వల్ల అనేక శారీరిక మానసిక రుగ్మతలను నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం గత 14 రోజులుగా సహకారం అందించిన వారికి మోమెంటోలు అందజేశారు. నిర్వాహకులు మామిడి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అన్ని విధాల సహాయసహకారాలు అందించిన మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మంతెన దశరథ మహారాజు, నల్లమల్లి నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. పందిటి రవి, మేడా సత్యనారాయణ, పువ్వాడ సుధీర్, శ్రీనివాస్,సింగయ్య, పద్మావతి, గంగాభవానీ, పవిత్ర, భాగ్యలక్ష్మీ, లక్ష్మీ కోటేశ్వరి, పద్మజ పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

కర్లపాలెం: పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. గురువారం సాయంత్రం కర్లపాలెం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఉన్న రికార్డులు పరిశీలించి ఎస్ఐ రవీంద్రకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర మోటారు వాహనాలపై ప్రయాణించే వారందరూ హెల్మెట్ ధరించే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు. నేర నియంత్రణకు అవసరం మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిపట్ల సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలన్నారు. కర్లపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ అభిషేక్, బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ, స్థానిక ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి చూపాలి



ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ నవీన్‌కుమార్, భాస్కరరావు

చెరుకుపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరదారుడ్యానికి ఎంతో దోహదపడతాయని రేపల్లె నియోజకవర్గ పీఓసీ మత్తి భాస్కరావు అన్నారు. నెహ్రూ యువకేంద్రం, మత్తి శివశంకరరావు ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో చెరుకుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో యువతకు జిల్లా స్థాయి ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. ఎంఈఓ టి.నవీన్‌కుమార్, మత్తి భాస్కరావు ప్రారంభిచారు. వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షాట్‌పుట్, క్రీడలలో పోటీలు నిర్వహించారు. సందర్భంగా భాస్కరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తికనపరచాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే త్వరగా ప్రభుత్వ ఉద్యోగాలు సాదించవచ్చన్నారు. రెండు రోజులు జరిగిన ఆటల పోటీల్లో విజేతలకు షీల్డు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఎల్లెల రవికిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు కె.వెంకటరావు, ప్రమీల, నరేంద్ర గోపి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మైక్రో స్కోప్ - హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్



ట్రైనింగ్ పాల్గొన్న విద్యార్థులు

బాపట్ల: అడ్వాన్స్‌డ్ ట్రినోక్యూలర్ మైక్రోస్కోప్–హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని బిఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు గోపాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా కళాశాల్లో మైక్రోస్కోప్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఫార్మాడీ, బీఫార్మసీ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అడ్వాన్స్‌డ్ పరికరాలను విద్యార్థులు అనునిత్యం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని గోపాలకృష్ణమూర్తి తెలిపారు. నైపుణ్యాన్ని పెంచుకున్న విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతస్థానాలు అధిరోహించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాయో టెక్నికల్ ఇంజనీర్ ప్రతాప్‌రెడ్డి, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు గెలుపునకు కృషి

రేపల్లె రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ కోరారు. కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఉద్యోగ, కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. కృష్ణా, గుంటూరు జిల్లాలా పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా లక్ష్మణరావును గెలిపించుకుంటే ఉద్యోగ, కార్మికుల సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తారన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుంధర్, కార్మిక సంఘాల నాయకులు ఎస్.బాబూరావు, కేవీ లక్ష్మణరావు, యు.రామకృష్ణ, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.